

# అనగనగా...కథలు

## - డా.శైలజ చందు



డియర్ రీడర్స్,

పేషంట్లు , హాస్పిటల్ గురించి కాకుండా ఎప్పుడైనా వేరే genreకథ వ్రాయాలని మనసుబలాటపడుతుంది.

దాని ఫలితమే ఈ నెల 'అనగనగా...కథలు'

చందు శైలజ

*గత సంచికలో జరిగిన కథ:*

*విరూపాక్షుడు గొప్ప శిల్పి. ఆలయ నిర్మాణ సమయంలో అతని కుమారుడైన కేశవుడు ఒక స్త్రీని చూసి శిల్పంగా చెక్కుతాడు. ఆ శిల్పంలో సంభవించిన వింత మార్పు చూసేందుకు ఆ దేశపు మహారాజు వస్తాడు. అది ఎవరి శిల్పమో, వివరాలు తెలుపమని కేశవుని కోరగా, అతడు నిరాకరిస్తాడు. ఇంతలో ఆ శిల్పంలో కదలికలు ప్రారంభమవుతాయి.*

**సూర్యాస్తమయం అవుతోంది**. ఆకాశం అరుణవర్ణంతో నిండి ఉన్నది. ఉధృతంగా వీచే గాలికి, లోయలోనున్న ఎత్తైన వృక్షాలు వేగంగా ఊగుతున్నాయి. చెట్లనుండి ఆకులు, పూవులు గాలికి వచ్చి ఆలయ ప్రాంగణంలో పడుతున్నాయి. ఆకాశంలో మేఘాలు వేగంగా ప్రయాణిస్తూ చెల్లా చెదురయ్యాయి. వృక్షాల మీద చేరిన పక్షులు భీతి చెంది, ఆలయ గోపురం పైన తలదాచుకున్నాయి.

ప్రకృతిలో ఆ మార్పులు ప్రళయానికి సంకేతం కాదు కదా అన్న సంశయం తో జనులంతా కలవర పడ్డారు.

శిల్పం కదలికలకు ఆలయ ప్రాంగణం కంపిస్తున్నది. వేగంగా వీచేగాలికి, శిల్పం యొక్క కురులు అగ్నిశిఖల వలే గాలిలో ఎగసిపడుతున్నాయి. దేవి ముందున్న జేగంటలు ఆగకుండా మ్రోగుతున్నాయి.

అందరిలోనూ తెలియని భయం ఆవరించింది.

విరూపాక్షుడొక్కడే నిశ్చలంగా నిలబడి ఉన్నాడు.

కేశవుడు ఆందోళనగా శిల్పం వైపు పరుగు తీయబోతుంటే , కొడుకుని మౌనంగా చేయిపట్టి ఆపాడు.

రాజు విరూపాక్షుడిని ప్రశ్నించాడు.

"విరూపాక్షా, ఏమిటీ వైపరీత్యం? ఆలయ నిర్మాణంలో ఏమైనా లోపం జరిగిందా? దేవి ఆగ్రహించిందా? ఎందుకిలా జరుగుతోంది?"

" మహారాజా, వేదన లేక , జన్మ ఉండదు. సృష్టి జరగదు."

"జన్మ? ఎవరి జన్మ? ఏమిటా సృష్టి?"

" కేశవుని శిల్పం సజీవమవుతోంది. అందుకు ప్రకృతి సహకరిస్తోంది. నిశ్చింతగా ఉండండి ప్రభూ!"

కొంత సేపటికి అగ్ని శిఖలా గాలికి ఎగసి పడుతున్న ఆమె కేశాలు శాంతించాయి.

ఆలయమంతా వెలుగుతో నిండింది. ఆ వెలుగుతో పరిచయమున్నది కేశవునికి మాత్రమే. మొదటిసారి ఆమెను ఆలయం వెనుక చూసి, శిల్పమని భ్రాంతి చెందిన నాటి కాంతి.

వెన్నెలలో స్వర్ణరేఖలు కలసిన కాంతి.

అప్పటి వరకూ ఆ ప్రదేశంలో ఉన్న శిల్పం అదృశ్యమైంది.

ఆ స్థానంలో అపూర్వమైన సౌందర్యంతో ప్రకాశిస్తున్న సజీవ సుందరి నిలబడి ఉన్నది. కేశవుడు చెక్కిన శిల్పానికి , సజీవంగా నిలబడిన ఆమెకూ భేదం ఏమీ లేదు.

శిల్పమే సౌందర్యమని తలచారు.

సౌందర్య దర్శనంతో శిల్పాల వలె నిలబడ్డారు.

ఆమె తెల్లని దుస్తులు ధరించింది. జిలుగు వస్త్రాల అడుగున ఆమె ముఖం స్వర్ణకాంతితో మెరుస్తోంది. పూల రెక్కల సౌకుమార్యపు వన్నెలతో ప్రకాశిస్తున్న ఆమె అందం చూస్తున్నవారికి మైమరుపు కలిగిస్తున్నది.

కనులలో ఇమడని అందం, మనసు నిండిన ఆనందమైనది.

జన్మకొక అనుభవం చాలుననిపించే ఒక అపురూప భావన కలిగింది వారందరికీ.

ఆమె, ఎవరికోసమో అన్వేషిస్తున్నట్లు నిలబడిన జనులందరినీ పరికించి చూసింది. కేశవుడు కనిపించగానే ముఖం వికసించింది.

ఆమె నడచి వస్తుంటే బంగారు పూలకొమ్మ నడచి వస్తున్న భావన. ఆలయమంతటా నిశ్శబ్దమే! ఆ నిశ్శబ్దంలో ఆమె ఆభరణాల సవ్వడి, దేవికి సంగీత నివేదనలా ఉన్నది.

కేశవుని పైనే ఉంది ఆమె దృష్టి.చూపులలో అతని పట్ల ఇష్టం పెదవుల వరకూ ప్రసరించి మందహాసమవుతోంది. భ్రమరాన్ని చూసిన పుష్పపు వేడుకలా ఆమెలో చిరునవ్వు విరిసింది. అనురాగపు అరుణిమ కలసిన కన్నులలో, శాంతం వెన్నెలలా కురుస్తున్నది. చంద్రోదయం కాకమునుపే వెన్నెల చల్లదనం తెలిసింది.

శారీరక శ్రమతో, కఠిన శిల వలె ధృఢంగా ఉన్న శరీరం తో ఎత్తుగా నిలబడి ఉన్నాడు కేశవుడు. సంధ్యా సమయపు అరుణ కాంతిలో అతని శరీరం నీలివర్ణంలో మెరుస్తూ ఉన్నది. మెలికలు తిరిగిన కేశాలు భుజాల వరకూ పెరిగి ఉన్నాయి. గాలికి నుదిటి ,మీద పడుతున్నాయి. సూటిగా ఉన్న నాసిక అతని గంభీర ప్రవృత్తికి చిహ్నంగా కనిపిస్తున్నది. నేరేడు పండ్ల వంటి కనులలో తెగువ , ధైర్యం నిండుగా ఉన్నాయి.

కేశవుని సమీపంలో నిలబడిన ఆమె మరింత సుకుమారిలా అనిపించింది. ఇరువురి చూపులు చిక్కని పూలమాలలవలె అల్లుకుపోయాయి.ఒకరికొకరు తోడుగా నిలబడినందుకే వారి వారి హృదయాలలో సంతోషం ఉత్సవమైంది. వారి మనసులు రెండూ అవిరామంగా సంభాషిస్తున్నాయి.

ఆశ్చర్యంగా చూస్తున్న అక్కడవారందరితోనూ చెప్పింది.

"నేను కళింగ ద్వీపానికి చెందిన యక్షరాజ కుమార్తెను. స్వర్ణ ముఖిని. కొన్ని దినాలకు ముందు, దివ్యశక్తుల సహాయంతో, ఈ ఆలయ విశేషాలు దర్శించేందుకు వచ్చాను. వివాహం కానంత వరకూ , కాబోయే భర్త తప్ప అన్యులు నన్ను చూడజాలరు. ఆనాడు నేను ఎవరి కంటా పడలేదు. కానీ నన్ను వెనుక నుండి చూసి,నా రూపాన్ని పూర్తిగా చూడకుండానే, యథాతథంగా నా రూపాన్ని శిల్పంగా మలచాడు.ఎంతో శ్రమించాడు."

నిర్భయంగా పలికిన ఆమె కంఠంలో పలికిన ఆమె కంఠంలో  అనురాగం ధ్వనించింది.

ఒక వ్యక్తి ని పూర్తిగా చూడకనే, శరీరంలోని కొంత భాగం మాత్రమే చూసి,  పూర్తి శిల్పాన్ని చెక్కగల శక్తి కేశవునికున్నందుకు ఆశ్చర్యపోయాడు విరూపాక్షుడు. ఆ విద్య తనకు తప్ప వేరొకరికి తెలియదు. ఎవరికీ నేర్పనూ లేదు. అనుభూతి అనంతమైతే తప్ప, ఎవరికీ సాధ్యం కానిదా విద్య.

ఆ తర్వాత, ఆమె విరూపాక్షుని వద్దకు వెళ్లి,

“నన్ను వీక్షించినవాడు మీ కుమారుడే.  అతడితోనే నా జీవితమని నా తండ్రికి తెలిపి, అనుమతి తీసుకుని వచ్చాను. నన్ననుగ్రహించండి”  అని విరూపాక్షుడిని వేడుకుంది.

సౌందర్యానికి సౌశీల్యం తోడైనట్లున్నది ఆమె ప్రవర్తన.

బంగారు పూల పరిమళం అందరి మనసులనూ ఆనందపరచింది.

విరూపాక్షుడు ఏమంటాడోనని అందరూ ఆతృతతో ఎదురు చూశారు. విరూపాక్షుడు ఆమె వినయానికి ఎంతో ముచ్చటపడ్డాడు.

ఆమె తడి కన్నుల దర్పణంలో ప్రతిఫలించిన భావాలను మనసులోనే ప్రశంసించాడు.

సాధారణంగా కనిపించే కేశవుడు, ఆమెకు తోడుగా నిలబడి సుందరాకారుడిగా కనిపిస్తున్నాడు. చూస్తున్న వారందరికీ సంతోషం కలిగిస్తున్నది వారి జంట.

విరూపాక్షుడు మహారాజు వద్దకు వెళ్లి , “ప్రభూ, వారిరువురినీ  ఆశీర్వదించాలని నా  విన్నపం. మీ చల్లనిపాలనలో కలకాలం ఆ దేవిని సేవించుకునే అదృష్టం కలగాలని దీవించండి."

మహారాజు మౌనంగా ఆమె వైపు చూస్తున్నాడు. అతని కన్నులలోని కాంక్షకు విరూపాక్షుడు కలవరపడ్డాడు. మహారాజు ఆలోచనలు ఎటు వైపు ప్రయాణిస్తున్నాయో పసిగట్టి, వాటిని దారిమళ్ళించే ఉద్దేశంతో

“ప్రభూ,  తండ్రి వంటి మీ ఆశీర్వాదం వారికి  దైవానుగ్రహం తో సమానం. వారిని ఆశీర్వదించండి.” అని కోరుకున్నాడు.

“విరూపాక్షా, నీకొక వరమివ్వాలని తలచాను.”

“ప్రభూ! ఆజ్ఞ”

“ఇంతకు మునుపే నీకు విధించిన మరణ శిక్ష రద్దు చేస్తున్నాను. నీ కుమారుడిని తీసుకుని తక్షణమే ఈ ప్రదేశం విడిచి వెళ్లు.” మహారాజు ముఖంలో, శిలను మించిన కాఠిన్యం గమనించి భీతి చెందాడు విరూపాక్షుడు.

"ప్రభూ, నా కుమారుడి మీద దయదలచండి. అతని క్షేమం, సంతోషం కోసం ప్రాణాల్ని త్యాగం చేయడానికి కూడా సిద్ధమే"

"నీ వృద్ధ ప్రాణాలు మాకెందుకు విరూపాక్షా, ఆ యవ్వనవతి అందాలను మాకు విడిచి పెట్టమని కేశవుడితో చెప్పు” అని పలికి

రాజు స్వర్ణముఖి వైపు కదలి,

"నీ వంటి అపూర్వ సుందరికి సామాన్యుడితో జీవనం తగదు. అసాధారణ సౌందర్యం అంతఃపురంలోయుండుటయే యుక్తము.” అని పలికాడు.

"రాజా, నీవెవరివో తెలియదు. ప్రభువులు అన్య స్త్రీలను పరిరక్షించాలి తప్ప పరిగ్రహించాలనుకోవడం అవివేకం." అంది స్వర్ణ ముఖి.

“ప్రభూ, ఆమె నాకొక అమూల్య నిధి.  ఆమె నా విధి. దయయుంచండి.” కేశవుడు చెప్పాడు.

“ఏ నిధి అయినా రాజు సొత్తు.” అని కేశవునితో చెప్పి, “సుందరీ, నీ అంగీకారం తెలిపి నన్ను పాలించు. అంతఃపురంలో నా ఇష్ట సఖివై సుఖించు.” అన్నాడు. ఆమె వైపు మరొక  అడుగు వేయబోతుండగా కేశవుడు ఆగ్రహంతో అడ్డుగా నిలబడ్డాడు.

అతని కదలికల్లోని దురుసుతనం, చూపుల్లో ధిక్కారం రాజుకు మిక్కిలి ఆగ్రహం తెప్పించింది.

అప్రయత్నంగా కత్తిపిడి మీద చేతినుంచాడు.

కేశవుడు మరింత వేగంగా, తన నడుముకున్న చురకత్తితో, రాజు ఖడ్గపు ఒరను బంధించియున్న పటకాను ఖండించాడు. రాజు తేరుకునే లోపున ఆ శక్తివంతమైన ఖడ్గాన్ని తన చేతితో పట్టి రాజు గుండెలమీద ఆనించి,

"క్షమించండి మహారాజా! ఆమె నా బాధ్యత. ఆ నిర్వహణలో ప్రాణాలను సైతం లక్ష్యపెట్టను"

ఆ హఠాత్పరిణామాన్ని ఎవరూ ఊహించలేదు. చుట్టూ ఉన్న సైనికులు కదలబోయారు.

కేశవుడు, వారి వంక చూసి , “మహారాజు క్షేమంగా ఉండాలంటే మీరెవ్వరూ కదలకండి” కఠినంగా పలికాడు.

విరూపాక్షుడి వైపు చూశాడు మహారాజు.

“గర్వపడుతున్నావు కదా విరూపాక్షా. సాక్షాత్తూ దేశానికి ప్రభువుపైనే కత్తి ఎత్తగల గొప్ప పుత్రుణ్ణి కన్నందుకు.”

విరూపాక్షుడు ఆందోళనతో, "ప్రభూ, కేశవుడు లోకరీతి యెరుగని అమాయకుడు. ఉచితానుచితాలు నేర్పనందుకు నన్ను శిక్షించండి. " అని రాజుతో పలికి " కేశవా, తక్షణం ఆ కత్తి కిందకు దించు. మాహారాజుని క్షమాపణ వేడుకో" అని కేశవునితో కోపంగా చెప్పాడు.

“విరూపాక్షా, విధేయుడవని నమ్మాను. ఈ వదరుబోతుని ప్రభువుపైకి ప్రేరేపించడమేనా నీ విధేయత?”

“కేశవా, ఆ కత్తి పడవేయి. ప్రభువుని క్షమించమని వేడుకో ” అని కఠినంగా పలికాడు విరూపాక్షుడు. స్థిరంగా చూస్తున్న కేశవుని వద్దకు వెళ్లి, అతని చేతిలోని ఖడ్గాన్ని లాగి మహారాజు పాదాల మీద పడవేశాడు.

ఒక సామాన్యుడు ప్రజలందరిముందూ, తన మీద కత్తితో దాడిచేయడానికి సాహసించడం!

ఒక స్త్రీ తనను కాదని ఆ సామాన్యుడిని వరించడం!

రెండూ భరింపరాని అవమానాలే.

అలవికాని క్రోధంతో రగిలిపోయాడు మహారాజు.

రెండిటికీ సరైన ప్రాయశ్చిత్తం చేయాలనుకున్నాడు. మరొక్క క్షణం వృధాచేయకుండా ఖడ్గాన్ని కేశవుని కంఠం పై ఆనించాడు.

“నీ వంటి అమాయకునికి తగిన శిక్ష ఏమిటో తెలుసునా?” అంటూ, కత్తి మొనతో కంఠంపై మరింత వత్తిడి పెంచాడు.

మహారాజు ముఖంలోని భావాలు చూసున్నవారందరిలోనూ ఆందోళన కలిగించాయి.

విరూపాక్షుడు" ప్రభూ, కేశవుడు చిన్నవాడు. తప్పు సరిదిద్దుకునే అవకాశం ఇవ్వండి. జన్మంతా మీ సేవ చేసుకుంటాడు.” బ్రతిమాలుకుంటున్నాడు.

“విరూపాక్షా! అడ్డు తొలుగు” మహారాజు కంఠంలోని కాఠిన్యం, చుట్టూ ఉన్నవారందరినీ వణికించింది.

తన ఖడ్గం మొన కేశవుని కంఠం మధ్యలో ఆనించి నెమ్మదిగా వత్తిడి పెంచుతూ వెనకకు నడిపిస్తున్నాడు.

ఎటు వైపు అడుగులు పడుతున్నాయో కేశవునికి తెలియడం లేదు.

ముఖం పైకెత్తి ఆకాశం వైపు చూడవలసి వస్తోంది.

విరూపాక్షుడు, స్వర్ణ ముఖి ఇరువురూ మహారాజుని వేడుకుంటున్నారు. కోపోద్రేకంతో ఉన్న
రాజు అతనిని ఆలయం వెనుక వరకూ తీసుకుని వెళ్లాడు.

హఠాత్తుగా జరుగుతున్న సంఘటనలతో బెదిరిపోయిన స్వర్ణముఖి భయంతో కంపిస్తూ కేశవుని వెంట వడివడిగా అడుగులేస్తున్నది.

చంద్రబింబం వంటి ఆమె ముఖంలో అశ్రువులు ధారలై కారిపోతున్నాయి.

"కేశవుని క్షమించండి ప్రభూ" అని విరూపాక్షుడు విలపిస్తూ వేడుకుంటున్నాడు.

మహారాజు చేతిఖడ్గపు పదునైన మొన కేశవుని కంఠంలో దిగడానికి సిద్ధంగా ఉంది. కంఠం నుండి రెండు మూడు బిందువులను చవి చూసినట్లున్నది. ఇంకా రుచిచూసేందుకు ఆసక్తిగా ముందుకు ప్రయాణిస్తోంది.

స్వర్ణ ముఖి ఆ దృశ్యాన్ని చూసి కలవరంతో "వద్దు మహారాజా, కేశవునికి ప్రాణహాని చేయవలదు. అతను లేని నా జీవితం వృధా" అని కన్నీళ్లతో వేడుకుంది.

తాను చేపట్టాలనుకున్న స్త్రీ, వేరొకరిపై అనురాగం కురిపించడం సహించలేకపోయాడు రాజు. కేశవుని కంఠంపై మరింత వత్తిడి పెంచాడు. ప్రాణ రక్షణకై కేశవుడు అడుగు వెనుకకు వేశాడు.

కేశవుని ప్రాణాలు ఆపదలో ఉండడంతో స్వర్ణముఖి భీతినొంది అతనికోసం వడివడిగా నడుస్తూ, కన్నీరు కారుస్తూ మహారాజు కెదురుగా నిలబడి వలదు వలదన్నట్లు తల అడ్డంగా ఊపుతూ చేతులు జోడించి వేడుకుంటోంది. ఎలా ప్రాధేయపడాలో ఆమెకు మాటలందడం లేదు.

ఒక్క క్షణంలో ఏమి జరిగిందో ఆమెకు అర్థం కాలేదు.

స్వర్ణముఖి కనుల ముందు అరుణ వర్ణం అలముకున్నది. కేశవుని రక్తంతో ఆమె కేశాలు తడిసిపోయాయి. ఆమె శ్వేత వస్త్రాలు , కెంపు వర్ణంలోకి మారాయి. ఆమె కన్నీరు రక్తాశ్రువులైనాయి. స్వర్ణముఖి రుధిర స్నానం చేసినట్లైంది.

కేశవుని కంఠం లో దిగిపోయిన ఖడ్గాన్ని లోయలోనికి విసిరి వేశాడు మహారాజు.

మహారాజు తన బలమంతా ప్రయోగించవలసి వచ్చింది , ఖడ్గానికి చిక్కుకున్న కేశవుని శరీరం తో బాటు విసిరివేయవలసి వచ్చినందుకు.

స్వర్ణముఖికి జరిగినది అర్థం చేసుకోవడానికి కొన్ని క్షణాలు పట్టింది. ఆమె ముఖంలో భావాలన్నీ ఘనీభవించాయన్నట్లు విగ్రహం వలె నిలబడిపోయింది.

ఎంతో మంది ప్రజలు చూస్తూ ఉన్నారు. తనవాడనుకున్న కేశవుడు లేడు. అతనిక తిరిగి రాడని అర్థమైంది. తానెంత శోకించినా ఫలితముండదని తెలిసింది. కొద్ది సేపటి క్రితం, అందరికీ అందాల వెన్నెలలు కురిపించిన ముగ్ధ సౌందర్యవతికి , రక్త స్నానంలో తడిసి వేదనతో కుమిలిపోతున్న శోకమూర్తికీ పోలికే లేదు. శాంతిని కురిపించిన కనుల నుండి క్రోధాగ్ని అశ్రువుల్లా జారిపోతున్నాయి.

కేశవుడు తన శిల్పాన్ని చెక్కిన ప్రదేశంలో నిలబడింది. ఆమె క్రోధమంతా ఆమె కేశాలలో ప్రతిఫలిస్తున్నట్లు, ఆవేశంగా ఎగసి పడుతున్నాయి. ఆ వంటిపైనున్న ఎర్రని వస్త్రాలు, అగ్నిశిఖల్లాంటి ఆమె కురులు చూపరులకు భయం గొలుపు తున్నాయి.

ఆమె దుఃఖాన్ని చూసిన ప్రజలు కూడా కన్నీరు పెట్టుకున్నారు.

క్రోధం, దుఃఖం, రాజు పట్ల అసహ్యంతో ఆమె మండుతున్న అగ్ని గోళంలా ఉన్నది. కొండ అంచున రక్త సిందూర ప్రతిమ వలే నిలబడింది.

"రాజా, నా శోకం నీ వంశాన్ని వెంటాడుతుంది" అని పలికింది.

మరుక్షణమే, ఆమె రూప సౌందర్యమూ, దుఃఖమూ , వేదనా, ప్రేమా లోయలో కలసిపోయాయి.

కొంత సేపటి క్రితం ఉన్న ఉగ్రవాతావరణమంతమై, విషాదమలముకున్నది. చీకటి పడుతోంది. పక్షులు ఇళ్లకు చేరకుండా ఆలయగోపురం మీదనే ఉన్నాయి.

ఒకరొకరే అంతా వెళ్లిపోయారు.

ఆలయ ప్రాంగణం మొత్తం ఆకులు , పూలతో అల్లకల్లోలంగా ఉన్నది. కేశవుని నిష్క్రమణకు సంకేతంగా కొన్ని పుష్పాలు రంగు మారాయి.

విరుపాక్షుడి శోకమొక్కటే, అలముకున్న అనంత శ్మశాన నిశ్శబ్దాన్ని నింపాలని అవిరామంగా ప్రయత్నిస్తోంది. ఆయన విలపించే తీరుకు చూస్తే శిష్యులెవరికీ దగ్గరకు వెళ్లి ఓదార్చే ధైర్యం రాలేదు.

ఆ తరువాత ప్రతి దినమూ , విరూపాక్షుడు ఆ ప్రదేశానికి వెళ్లి కూర్చునే వాడు.

కొన్ని నెలల తరువాత, కొండ అంచున లోయనుండి రెండు ఎత్తైన నీల సిందూర వృక్షాలు పెరిగాయి. నిత్యం ఊసులాడుకుంటూ ఉండే వృక్షాలు. ఒక వృక్షానికి నీల సిందూర పుష్పాలు పూస్తూ ఉండేవి. విరూపాక్షుడు అక్కడ నిలబడి ఉత్తరీయాన్ని విప్పి పట్టుకుంటే కొమ్మలు వంగి పుష్పాలను జల జలా రాల్చేవి. ఆయన కనులవెంట అశ్రువుల వలె.

వాటిని దేవి పూజకు వినియోగించేవారు.

వసంత చంద్రిక, పింగళ దేశాన్ని ఏలే హిమస్రుతుడి కుమార్తె. ప్రజలంతా ఆమె అందం గురించి ఎన్నో కథలు చెప్పుకునే వారు. సూర్యదేవుని వరంతో జన్మించినందువలనే ఆమెకా శరీర చ్ఛాయ అనీ, బాల్యం నుండీ ఆమెను బంగారమూ వెన్నలతోనే పెంచారనీ, స్వర్ణరేఖ ధాన్యాలతో వండిన అన్నమే తినిపించారనీ, మేలిమి జాతి పండ్ల రసాలే త్రాగించారనీ నగరంలో పలు విధాలుగా చెప్పుకునేవారు. ఆమె దేవాలయానికి అరుదుగా వెళుతుంది. ఆమె పల్లకి వెళుతుంటే, ఆ పల్లకి సంగీత ధ్వనులని వినేందుకు నగర ప్రజలు నిలబడేవారు. పల్లకి తెరలలోనుండి ఆమె పట్టుకొంగు కనిపించినా సరే మహద్భాగ్యంగా చెప్పుకునే వారు. దేవాలయపు మెట్లు ఎక్కుతున్నపుడు సున్నితమైన ఆమె పాదాలను చూసి మైమరిచిపోయేవారు. కాలికి అలంకరిచిన స్వర్ణ మంజీరాల ఒరిపిడికి ఆమె పాదాలు నొచ్చుకుంటున్నాయేమోనని బాధపడేవారు.

ఆమెకు యుక్త వయసు వచ్చాక ఆమెకు తగిన వరుని కోసమై విచారించసాగాడు ఆమె తండ్రి. ఎందరో రాజకుమారులు ఆమె చిత్రపటం చూసి మైమరచిపోయేవారు. చివరకు, ఆమె అందానికి తగిన వారము కాదనీ, ఆమెను చేపట్టే అర్హత తమకు లేదనీ తిరస్కరించేవారు. వరుడిగా నిలబడిగిన వారుండేవారు కాదు. సౌందర్యమొక శాపంగా పరిణమించింది ఆమెకు. ఎవరికి వారు, ఆమెకు తాము సరితూగమన్న అభిప్రాయంలో మరలిపోయేవారు.

పొరుగుదేశంలో నీల సిందూర పర్వతం మీద నున్న కాత్యాయినీ దేవి ఆలయం మహిమాన్వితమైనదనీ, అక్కడున్న నీల సిందూర వృక్షాలకు మొక్కితే కల్యాణమవుతుందని హిమస్రుతునికి తెలియవచ్చింది. సైనికుల రక్షణతో ఆమెనొకనాడు ఆ ఆలయానికి పంపాడు. పరిచారికలు వెంట రాగా , రత్నాలు పొదిగిన పల్లకిలో ఆమె ఒక పౌర్ణమి నాటి సాయంత్రం ఆలయానికి వెళ్లింది వసంత చంద్రిక.

ఆమె ఆలయానికి చేరుకునే సమయానికి, ఆ దేశపు యువరాజైన రుద్రవర్మ దేవాలయంలో పూజలు జరుపుతున్నాడు. కనుక సాధారణ ప్రజలకు అనుమతి లేదు. యువరాజు వెంట వ్యక్తిగత రక్షణాధికారీ, సన్నిహిత మిత్రుడూ అయిన విజయుడు మాత్రమే ఉన్నాడు. తక్కిన సైనికులందరూ కొండ కింద కావలి కాస్తున్నారు. కానీ వచ్చినది పొరుగు దేశపు యువరాణి కావడంతో ఆమెను నిరాకరించడం సమంజసమనిపించలేదు సైనికులకు. ఆమెను, తోటి పరిచారికలనూ ఆలయంలో ప్రవేశించడానికి అనుమతినిచ్చారు.

ముందుగా ఆలయం వెనుకనున్న ఉన్న లోయలోని నీల సిందూర జంట వృక్షాలకు ప్రత్యేకంగా పూజలు జరిపి దేవాలయంలోనికి వెళ్లింది.

ఆ సమయానికి గర్భ గుడిలోనున్న యువరాజుతో అర్చకుడు ప్రత్యేక పూజలు జరిపిస్తున్నారు. అందువలన ఆమె కొంత సేపు వేచియుండాలని సూచించారు.

ఆమె తలవంచుకుని నిరీక్షిస్తున్న సమయంలో , ఎటునుండి వచ్చిందో ఎవరూ గమనించలేదు, నేల మీద జీరాడుతున్న ఆకు పచ్చని మేలి ముసుగుని ఆధారంగా చేసుకుని ఒక సర్పం పాకుతుండడం చూసింది పక్కనే ఉన్న పరిచారిక. భయంతో ఆ పరిచారిక 'సర్పం, సర్పం' అంటూ కేకలు వేయసాగింది.

వసంత చంద్రికకు, ఆమె దుస్తులపై, పారాడున్న సర్పం యొక్క కదలికలు తెలుస్తూ ఉన్నాయి. భయంతో స్థాణువైపోయింది. ఆ ప్రదేశంలోనే యువరాజుకు రక్షణాధికారిగా వచ్చిన విజయుడు నిలబడి ఉన్నాడు.

కేకలు వేస్తున్న పరిచారికకు నిశ్శబ్దంగా ఉండాలన్న సూచన చేసి, చంద్రికకు దగ్గరగా వచ్చి మేలి ముసుగు పైనున్న గోధుమవన్నె త్రాచుని ఒడుపుగా చేజిక్కించుకున్నాడు. ఆ ప్రయత్నంలో అతని చేతికి ఆమె మేలి ముసుగు కూడా అందింది. రెంటినీ కలిపి ఒక గవాక్షం వైపు విసిరి వేశాడు. పరిచారికలు, చంద్రిక అతడు విసిరి వేసిన దిక్కు వైపు చూశారు. బలమైన త్రాచు పాము జరజరా పాకుతూ అదృశ్యమైపోయింది. ఆ దృశ్యం చూసిన చంద్రిక భయంతో వణికిపోయింది. తన మేలి ముసుగు మీద సర్పం యొక్క కదలికని అనుభవించిన జుగుప్సా , సర్పాన్ని చూసిన మీదట కలిగిన భయమూ ఏకమై, ఆ రక్షించిన వారెవరో చూడకుండా అతడిని గట్టిగా పట్టుకుంది. చిగురుటాకులా వణికిపోతూ, కొన్ని క్షణాల పాటు, కఠినమైన శిలవంటి అతని గుండెలపై తలవాల్చి నిలబడింది.

తనను ఆలింగనం చేసుకున్న ఆ సౌందర్యవతిని ఓదార్చుతున్నట్టు, భయం లేదన్నట్లు ఆమె వెన్ను తట్టి , పక్కనే ఉన్న పరిచారికకు ఒప్పగించాడు విజయుడు.

విజయుడు, యువరాజు రుద్రవర్మకు సహాధ్యాయి. ఇరువురూ ఒకే గురువు వద్ద విద్యనభ్యసించారు. యుద్ధ విద్యలు నేర్చుకునే సమయంలో, విజయుడి ప్రతిభను గమనించిన మహారాజు అతడిని రుద్రవర్మకు సహచరునిగా, భద్రతాధికారిగా నియమించారు.

యుద్ధంలో అతడికి అపజయమన్నది తెలియదు. పలుమార్లు రుద్రవర్మ అపాయంలో ఉన్నపుడు ప్రాణాలకు తెగించి కాపాడాడు. విజయునికి యుద్ధ నైపుణ్యమే కాకుండా , ఎన్నో రహస్య యోగ విద్యలు తెలుసునని అతడిని ఎవరూ బంధించలేరని, ఒకవేళ బంధించినా, మరు నిముషంలో విముక్తుడు కాగల అద్భుత విద్యలన్నీ తెలుసునని యుద్ధభూమిలో అతనిని చూసినవారు చెప్పుకుంటారు. అత్యంత విపత్కర పరిస్థితులలో సైతం అతడు తప్పించుకుని బయట పడగల సమర్థుడని వారి విశ్వాసం.

అతనిది గంభీరమైన ప్రవృత్తి. పటాటోపాలకు దూరంగా ఉంటాడు. సామాన్యుడిలా క్రమబద్ధమైన జీవితం గడపడానికే ఇష్టపడతాడు. ముఖంలో ప్రసన్నత తప్ప, పెద్దగా నవ్వుతుండగా అతడిని ఎవరూ చూసి ఉండరు. అంతఃపుర స్త్రీలతో సంభాషించడం అరుదు.

యుద్ధకాంక్ష, దేశ విస్తరణ పట్ల ఆసక్తి ఉన్న రుద్రవర్మకు వెన్నంటి ఉంటాడు. ఉద్యోగ ధర్మం పాటించుటలో ఉన్న ఆనందం తప్ప అతడికి కీర్తికాంక్ష లేదు. తను సాధించిన ఎన్నో విజయాలను యువరాజుకు ఆపాదించాడు. రాజ్యము, రాజ్యక్షేమమూ తప్పించి అతడికి వేరే వ్యాపకం తెలియదు. వివాహం కాలేదు. అతడి జీవితం దేశం కొరకే అని అందరూ విశ్వసిస్తారు, అతనితో సహా.

విజయుడి నుండి విడివడిన కొంత సమయం తరువాత కూడా చంద్రిక కు బెదురు తగ్గలేదు. కళవళ పడుతూ ఉన్నది. ఇంతలో పూజలు ముగించుకుని గర్భగుడిలో నుండి యువరాజు రుద్రవర్మ, వారు నిలబడిన చోటికి వచ్చాడు. ఎదురుగా నిలబడ్డ చంద్రికను చూశాడు.

ఆమె పైనుండవలసిన ముసుగు లేదు. కేశాలు సైతం విడివడి ఉన్నాయి. ఆమె కలతబారి ఉన్న హృదయంతో కనులు దించుకునే ఉన్నది.

ఎవరీమె?

ఒకటి రెండు క్షణాలు అప్రతిభుడైపోయాడు. అర్చకుడేవో

ఆలయ విశేషాలను యువరాజు కు చెబుతున్నాడు. అవేమీ చెవినపడలేదు.

ఆమె ఎవరు. ఎందుకలా ఖిన్నురాలై ఉన్నది?

ఇంతటి సౌందర్యవతి తన రాజ్యంలో ఉందని తెలియదే? ఆమెది తమ రాజ్యమేనా? ఎక్కడినుండి వచ్చింది?

ఆమె కలతకు కారణమేమిటి?

వివరాలు అక్కడికక్కడే విచారించడం ప్రభువుల స్థాయికి తగదని భావించి, అచటినుండి కదిలి వెళ్లిపోయాడు.

ఆ దేశ ఆచారం ప్రకారం వివాహం కాకుండా, యువరాజుకు పట్టాభిషేకం చేయరాదు. రుద్రవర్మకు ఎందరు రాజకుమార్తెల చిత్రపటాలను చూపించినా , ఫలితం లేకపోయింది. అతడికి కల్యాణం, ఆ పైన పట్టాభిషేకం సత్వరంగా జరపాలన్న ఆతృతలో ఉంది రాజమాత. ఆ ఆలోచనతోనే , రుద్రవర్మను దేవి ఆలయంలో పూజలొనర్చి రమ్మని పంపింది రాజమాత, నందిని.

ఆలయం నుండి కలవరపాటుతో ఇంటికి వచ్చింది వసంత చంద్రిక. ఎవరితోనూ సంభాషించకుండా తన మందిరంలోనికి వెళ్లింది. గుండె వేగంగా కొట్టుకుంటోంది. ఎంత భయమైతే మాత్రం ఒక అపరిచితుడిని తాను తాకడం ఏమిటి?

పొరపాటు జరిగిందని తనని తాను నిందించుకున్నది.

అతని ముఖమెలా ఉంటుందో తెలియదు.

వ్యక్తిగా ఎటువంటి వాడో తెలియదు.

బెదరవద్దన్నట్లు తన వీపుపై అతని చేతి కదలికలు జ్ఞప్తికి వచ్చాయి.

క్షణకాలంలో కొండంత నిశ్చింత కలిగించిన అతని చేతి స్పర్శ.

మనసు తుళ్ళిపడింది.

గవాక్షంలో కూర్చుని అస్తమిస్తున్న సూర్యుడిని చూసింది. సిందూర వర్ణంలో మెరుస్తూ నీలాకాశానికి సిందూరపు రంగు అద్దుతున్న సూర్యుడు ఆమె చెంపలకు కూడా అద్దాడు.

స్నానానంతరం ఆమెను అలంకరిస్తున్నపుడు, ఆమె మనసు ఏదో లోకంలో విహరిస్తున్నట్లు పసిగట్టారు పరిచారికలు. పదే పదే విజయుని సాహసం, సమయస్ఫూర్తి గురించి మాట్లాడుకుంటున్నారు.

“వీరుడట.”

“ఎన్నో యుద్ధాలలో అజేయుడిగా నిలిచాడట."

“ ఇతని తోడు లేనిదే, యువరాజు అడుగైనా వేయడట. శత్రువులకు అతడి పేరు వింటేనే భయమట.”

అతని గురించిన ప్రశంసా వాక్యాలన్నీ మధురమైన తేనెపలుకులవలె చెవిలో పడుతున్నాయి.

‘అతని పేరేమిటో.’ అనుకుంది.

అన్య పురుషుడి గురించిన వివరాలు చెబుతున్నపుడు చంద్రిక తమని వారింపకపోవడం గమనించారు చెలికత్తెలు.

కేశాలంకరణ చేస్తున్న పరిచారిక కొద్దిగా ఆగి.

“ఎంతటి గొప్పవాడైతేనేమి. మొరటువాడు” అని చెప్పింది.

చంద్రిక ముఖం చిన్నబోయింది.

“అదేమి?” మిగిలిన వారు ప్రశ్నించారు.

“చూడండి ఇక్కడ ఎంత కందినదో.  సుకుమారినెలా పట్టుకోవాలో ఎరుగని మొరటువాడులా ఉన్నాడమ్మా.”

ఆలయంలో యువకుడు బలంగా ఒడిసి పట్టడం జ్ఞప్తికి వచ్చింది చంద్రికకు.

విరిసిన మందహాసాన్ని అదుపు చేయలేక  కనులు మూసుకున్నది.

ఆమె ముఖ కమలం ఎర్రతామరలా వికసించింది.

“అక్కడ కందినదేమని అడిగితే , ఇక్కడ కందినదేమమ్మా” అంటూ చెక్కిలి తడిమింది చెలికత్తె.

ఆ నాటి రాత్రి విజయుడు తన మందిరానికి వెళ్లాడు. శరీర ధారుద్యానికి అతను బలవర్ధకమైన ఆహారం తీసుకుంటాడు. ఆనాటి ఆహారం చాలా రుచికరంగా కుదిరిందనీ, విజయుడు తప్పకుండా ఇష్టపడతాడనీ సంతోషంగా అమర్చారు సహాయకులు. అతడేదీ ముట్టుకోలేదు. ఎర్రటి పండునొకదాన్ని చేతిలో ఏదో ఆలోచిస్తూ నిలబడ్డాడు. అది కూడా తినలేకపోయాడు.

రాత్రి నిదురపోవాలని ప్రయత్నించాడు. శయ్య కుదరడం లేదు. మిద్దె పై నడిస్తే అలిసిపోయి నిద్రవస్తుందని పైకి వెళ్లాడు. రాతి మిద్దె చల్లగా ఉంది.

క్షణ క్షణం,  తనకు దగ్గరగా నిలబడిన ఆమె జ్ఞప్తికి వస్తూ ఉన్నది. కలవరపరుస్తోంది.

ఆమె మేలి ముసుగు చేతితో తాకిన తానెంత ధన్యుడు. ఆ చేతిని చూశాడు. యుద్ధంలో ప్రతాపం చూపినందుకు ప్రశంసాపూర్వకంగా తొడిగిన స్వర్ణ కంకణం మెరుస్తోంది. కంకణం తీసి అంగీలో భద్రపరచాడు. ఆమెకూ, అతనికీ అది అడ్డులా అనిపించింది.

“ఎంత మంచిదామె.” పైకే పలికాడు.

గాలి నవ్వినట్లనిపించింది.

‘అంతటి భయస్థురాలు మంచిదెందుకు కాదు.’ మనసులోనే గాలితో వాదించాడు.

‘హిమంలో తడిసిన మల్లె చెండులా వణికింది. ఆమె సుగుణాల రాశి.’ అనుకున్నాడు.

పూలదండ వలె ఎంత సుకుమారంగా ఉన్నది.

క్షణ కాలం పాటు తన చేతులలో ఇమిడిపోవడం.

కఠినమైన శిల వంటి హృదయంలో జాజుల జడివాన కురిసినట్లైంది.

సంతోషంతో చిరునవ్వు నవ్వాడు.

ఆమె రెండు చేతులతో, తన దేహాన్ని గట్టిగా పట్టుకున్న ఆ క్షణం మరల మరల జ్ఞప్తికి వస్తున్నది.

'కొన్ని క్షణాలైతేనేమి , స్వర్గప్రాప్తి అదృష్టమే కదా. ఎంత ధన్యుడిని.’ నిట్టూర్చాడు.

మనసులో తెలియని సంతోషంగా ఉంది. వెనువెంటనే విచారమనిపిస్తున్నది. బాధ తెలుస్తున్నది. అటువంటి భావన అతనికిదివరకెన్నడూ కలిగిందిలేదు. కారణమేమిటో అర్థం కాలేదు.

చల్లటి రాతి నేలపై పడుకుని ఆకాశం వంక చూశాడు.

'చాలా కష్టంగా ఉంది.' నక్షత్రాలకు విన్నవించుకున్నాడు.

'ఆమెననుగ్రహించండి.' బతిమాలుకున్నాడు.

బెదరవద్దన్నట్లు ఆమె వీపు తట్టినపుడు చేతికి ఆకళింపైన ఆమె నునుపుదనం, తన చేతికి వెన్న రాసినట్లైంది.

ఈ చేతికి ఒక సారి ఆ చేతిని వెన్నెల కాంతిలో చూసుకున్నాడు.

'ఎంతటి అదృష్టం' అనుకుంటూ కళ్లు మూసుకున్నాడు.

ఆమె శరీరపు నునుపుదనం వలన చేయి జారినట్లైంది. జ్ఞాపకాల్లో చేతికి తగిలిన ఆమె కంచుకపు ముడి స్పర్శ అనుభవమైంది. ఉలికిపడి దిగ్గున లేచి కూర్చున్నాడు.

ఆమెను చూడాలన్న కోరిక ఒక్క సారిగా అనంతమైంది.

ఆమె తనకోసమే.

దేవి అనుగ్రహమే.

'ఆమె ఎవరో యువరాణి. ఏ దేశమో తెలియదు. మరల నీకు కనిపిస్తుందన్న నమ్మకమూ లేదు.' మనసు నచ్చజెప్పబోయింది.

ఆమెను కలవాలని, చూడాలని మనసు గజిబిజి చేస్తున్నది.

దేవి ముందు తన సమీపంలో నిలబడిన ఆమె తనకోసం కాకపోవడమెలా?

'అది అధర్మం' అనుకున్నాడు. కంటిలో నీరు నిలిచింది.

అసమాన ధైర్యశాలిగా పేరు గాంచిన విజయుని కంటిలో నీరు.

మిద్దె మీద విశ్రమించలేక అశాంతిగా కదిలాడు. తెల్లవారుతోంది.

ఉదయాన్నే, అత్యవసరంగా రమ్మని యువరాజు వద్ద నుండి కబురు అందింది.

అతను వెళ్లే సమయానికి మహామంత్రి, యువరాజుతో సమావేశమై యున్నాడు. కొన్ని రథాలు, అశ్వాలు, ప్రయాణానికి సిద్ధంగా ఉన్నాయి. రథాల నిండుగా బహుమానాలున్నాయి. దేశాలపై దండెత్తబోయే ముందు , మంత్రితో రాయబారము పంపించుట ఒక ఆనవాయితీ. కొందరు రాజులు లొంగిపోయి సామంతులు కావడానికి సిద్ధ పడతారు. వారికి బహుమానాలిచ్చి, ఆ రాజ్యాన్ని సామంత రాజ్యంగా ప్రకటిస్తారు.

"విజయుడున్న చోట విజయమేనని తెలుసు. శుభవార్త తీసుకుని రావాలి." యువరాజు రుద్రవర్మ విజయుని భుజం తట్టాడు.

కొన్ని గడియల ప్రయాణం తరువాత వేరొక దేశం లో అడుగు పెట్టారు. ఆ దేశపు రాజుతో సమావేశమయ్యారు మహామంత్రీ, రాజ గురువు.

మర్యాదలనంతరం మహామంత్రి ఆ దేశపు రాజుతో పలికాడు. "రాజా, మా యువరాజు రుద్రవర్మ ఎంతో పరాక్రమవంతుడు. ఎన్నో దేశాలను యుద్ధంలో అవలీలగా జయించాడు. అతనంటే శత్రువులకు సింహ స్వప్నం." యువరాజుని కీర్తిస్తున్నాడు.

పరిచారిక బంగారు పాత్రలతో పానీయాలను అందిస్తున్నది. విజయుని వద్దకు వచ్చి ఇవ్వబోగా అవసరం లేదన్నట్లు సూచించాడు.

"మర్యాదలు వద్దంటే ఎలా?" అన్నది పరిచారిక.

ఆమె పరాచికాలకు విజయుడు సమాధానమివ్వదలచుకోలేదు.

“తీసుకోకపోతే పంపించిన వారు నొచ్చుకుంటారు.” అన్నది కదలకుండా అక్కడే నిలబడి.

‘పంపించిన వారెవరో?’ ఆమె వైపు చూశాడు.

పైకి చూడమన్నట్లు సంజ్ఞ చేసి పానీయాన్ని అతని చేతిలో ఉంచి వెళ్లింది.

విజయుడు పైకి చూశాడు. రాత్రి చేసిన జాగారానికి ఫలితంగా దేవి దర్శనం అయినది. తనేమీ కలగనడం లేదుకదా అని మరొకమారు చూశాడు.

ఆ మెరుపు, మందహాసమై తెర వెనుకకు తప్పుకున్నది.

తనను రాత్రి మొత్తం నిదురపోనీయని హృదయ రాణి, సమీపంలోనే ఉన్నదా?

మహామంత్రి పక్కనే ఉన్న రాజ గురువు ఆ దేశపు రాజుతో చెబుతున్నాడు

"రుద్రవర్మ అందంలో మన్మధుడు. నీ కుమార్తె ఎంతో అదృష్టవంతురాలు. ఎందరో రాకుమార్తెల చిత్రపటాలు చూపినా మా యువరాజు, వివాహంపై ఆసక్తి చూపలేదు. నిన్న నీ కుమార్తెను ఆలయంలో చూచిన వద్దనుండి .."

ఆ తరువాత సంభాషణ, విజయుని చెవిన బడలేదు.

తన మనసులో ఉన్న సుందరికి, యువరాజు పంపిన కానుకలు సమర్పించడానికి వచ్చాడా?

హృదయం కలుక్కుమన్నది.

దైవమెందుకిలా పరీక్షిస్తాడు?

విధి నిర్వహణలో ప్రభువు కోసం ప్రాణాలర్పించడానికి సైతం సిద్ధమే.

కానీ ప్రాణానికన్నా విలువైనవుంటాయని నిన్ననే కదా బోధపడింది.

ఎలా ఇపుడు?

(ముగింపు వచ్చే సంచికలో)

Post your comments